ప్రజాశక్తి

శుక్రవారం 30 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అందని బిల్లులు

దేవరాపల్లి మండలంలో నిలిచిన కాశీపురం - గవరవరం రోడ్డు పనులు

- రూ.132 కోట్లు బకాయి
- మధ్యలో ఆగిపోయిన రహదారి పనులు
- కాంట్రాక్టర్ల నేలచూపులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు, మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో తారు, సిమెంట్ రోడ్లు, భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు కూటమి ప్రభుత్వం సరిగా బిల్లులు చెల్లించడంలేదు. ఉపాధి మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేసిన పనులకు బిల్లుల బెడద వుండదన్న నమ్మకంతో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చుక్కలు చూపెడుతోంది. బిల్లులు రాకపోవడంతో ప్రారంభించిన పనులు పూర్తిచేసేందుకు పెట్టుబడుల్లేక మధ్యలోనే పనులు నిలిపివేశారు. ఉపాధి నిధులతో పనులెందుకు చేపట్టామా ? అని తలలు పట్టుకుంటున్నారు. చేసిన పనులకు చెల్లించాల్సిన బిల్లులు దాదాపు రూ.132 కోట్లకు చేరింది. ఉపాధి నిధులతో చేపట్టిన పనులకు ఢోకా వుండదని నమ్మించి కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యేలు పనులు చేయించారు. పనులు జరిగేలా వారిపై ఒత్తిడి చేశారు. కానీ బిల్లుల చెల్లింపులో చేతులెత్తేయడంతో పనులు ముందుకు సాగడంలేదు.

జిల్లాలోని పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, యలమంచిలి, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల్లో మెటీరియర్ కాంపొనెంట్ నిధులతో చేపట్టాల్సిన 189 కిలోమీటర్ల పొడవుగల 1734 రోడ్డు నిర్మాణ పనులు మంజూరయ్యాయి. తారు, సిమెంట్ రోడ్లు, వివిధ భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ప్రవాహంలా వచ్చిపడతాయని ప్రభుత్వం భావించింది. బిల్లుల బెడదవుండదని కావాల్సిన కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యేలు పనులు కట్టబెట్టారు. జరిగిన పనులకు బిల్లులు పెట్టినా రాకపోవడంతో మునిగిపోయేలా మిగతా 2లో..

సమైక్యతా యాత్రలో పాల్గొన్న లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలి

- బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం దారుణం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం
- అనకాపల్లిలో సమైక్యతా యాత్ర

ప్రజాశక్తి - అనకాపల్లి : ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మతసామరస్యాన్ని కాపాడుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు సిపిఎం చేపట్టిన సమైక్యతా యాత్ర గురువారం అనకాపల్లిలో ఉత్తేజంగా సాగింది. సిపిఎం కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్ వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉగ్రవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభను ఉద్దేశించి లోకనాథం మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను మిగతా 2లో..

డిఏ బకాయిలు చెల్లించాలి

వార్త 2లో..

ఒలింపియాడ్‌లో విశాఖ విద్యార్థుల సత్తా

వార్త 2లో..

నిరాశ్రయ, అనాథ బాలలకు ఆధార్ కార్డులు

వార్త 2లో..

పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు

750 కిలోల గంజాయి స్వాధీనం

9 మంది అరెస్టు

ప్రజాశక్తి - అనకాపల్లి : కొంతలం - అడ్డసరం గ్రామాల మధ్యనున్న ఆయిల్ పామ్ తోటలో నిల్వ చేసిన 37 లక్షలా 50 వేల రూపాయల విలువచేసే 750 కిలోల గంజాయిని రోలుగుంట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసు వివరాలను ఎస్‌పి తుహిన్ సిన్హా తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గంజాయితో పాటు మూడు మోటార్ సైకిళ్లు, ఒక హ్యుందాయ్ వెన్యూ కారు, రూ.2,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గంజాయి నిల్వ విషయమై ముందస్తు సమాచారం రోలుగుంట ఎస్ఐ పి.రామకృష్ణారావు, కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాసరావులకు మిగతా 2లో..

10న విశాఖకు రాష్ట్రపతి రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 10న విశాఖకు రానున్నారు. బీచ్ రోడ్డులో జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఇప్పటికే రాష్ట్రపతి పర్యటన వివరాలు విశాఖ కలెక్టరేట్‌కు అందాయి. జూన్ 10న ఉదయం 11.30 గంటలకు ద్రౌపది ముర్ము ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. స్వాగత కార్యక్రమాల తర్వాత 11.40కి విమానాశ్రయం నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో 11.50కి బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్తారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు అక్కడ జరిగే కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు వేదిక వద్ద బయలుదేరి 1.20 గంటలకు ప్రత్యేక విమానంలో జార్ఖండ్ పర్యటనకు వెళ్లనున్నారు.



థగ్ లైఫ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న కమల్ హాసన్, శింబు, త్రిష తదితరులు

సందడిగా 'థగ్ లైఫ్' సినీ ఈవెంట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కమల్ హాసన్ హీరోగా, లెజెండరీ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో, ఆస్కార్ విజేత ఎఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో ఈ హై-వోల్టేజ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా నిర్మించిన 'థగ్ లైఫ్' చిత్రం జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో గురువారం సాయంత్రం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో నిర్మాతలు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఇది ఎంతో సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సల్ హీరో కమలహాసన్ మాట్లాడుతూ తన 21 ఏళ్ల వయసు నుండి విశాఖలో ఎన్నో చిత్రాల షూటింగ్‌లు నిర్వహించినట్టు గుర్తు చేసుకున్నారు. ఈ నగరం ఎంతో ప్రత్యేకమైనదన్నారు. విశాఖలో చిత్రీకరించిన మరో చరిత్ర చిత్రం ద్వారా తనకు తెలుగులో అభిమానులు ఏర్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో హీరో శింబు, హీరోయిన్లు త్రిష, అభిరామి, నటుడు నాజర్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

అందని బిల్లులు

వున్నామని కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో జరుగుతున్న పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.132 కోట్లు కేంద్రం నుంచి రావాల్సివుంది. తాము చెప్పినట్లు నడిచే ఎన్‌డిఎ ప్రభుత్వం నుంచి నిధులకు ఇబ్బందివుండదని కూటమి ప్రభుత్వం అనేక పనులకు అనుమతులు మంజూరుచేసింది. ఈ పనుల మంజూరులో నిబంధనలు పక్కాగా పాటించలేదని భావించిన కేంద్ర ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఆపేసింది. గత ఏడాది నవంబరు నుంచి రహదారులు, భవన నిర్మాణ పనులు మొదలెట్టినా బిల్లులు మాత్రం ఈ నాటికీ పూర్తిగా చెల్లించలేదు.

జిల్లాలో 166 కిలోమీటర్ల పరిధిలోని 1354 రోడ్డు నిర్మాణ పనులు ఫిబ్రవరి అర్ధభాగానికి పూర్తయ్యాయి. పూర్తిచేసిన పనులకు రూ.132 కోట్లు రాకపోవడంతో మిగిలిన పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ఆసక్తిచూపడంలేదు. అధికారులు తొలుత చేసిన ఒత్తిళ్లతో పనులు జరిగినా, బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యంతో వారుకూడా కాంట్రాక్టర్లపై ఒత్తిడిచేయడం మానేశారు. బిల్లుల ప్రభావం పనులపై పడింది. దేవరాపల్లి, రోలుగుంట, రావికమతం, నాతవరం, గొలుగొండ మండలాల్లో పలు రహదారుల పనులు నిలిచిపోయాయి.

750 కిలోల గంజాయి స్వాధీనం

చేరింది. కొంతమంది వ్యక్తులు గంజాయిని వాహనంలో తీసుకొచ్చి కొంతలం, అడ్డసరం గ్రామాల మధ్య ఉన్న ఆయిల్ పామ్ తోటలో నిల్వ చేస్తున్నట్టు గుర్తించారు. వెంటనే దాడులు చేసి గంజాయిని పట్టుకున్నారు. 9 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇద్దరు పరారయ్యారు. నిందితులుగా ఉన్న రోలుగుంట మండలానికి చెందిన వియ్యపు గోవింద, బంగారు అప్పల నాయుడు, తమరన వెంకట శ్రీనివాసరాజా, కడిమి రాకేష్, బొడ్డు నానాజీ, ఒడిశా రాష్ట్రానికి చెందిన కలిమేల, మల్కనగిరికి చెందిన పాపులు వెంకటేష్, వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన మారిగెల లక్ష్మణ్ రెడ్డి, మడుల శివ కుమార్‌లను అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. మీడియా సమావేశంలో అదనపు ఎస్‌పిలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్‌పి ఎం.శ్రావణి, కొత్తకోట సిఐ జి.కోటేశ్వరరావు, రోలుగుంట ఎస్ఐ పి.రామకృష్ణారావు, కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలి

నూరిపోస్తోందన్నారు. పర్యవసానంగా ఇటీవల కాలంలో ముస్లిములపై 112 దాడులు జరిగాయని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సమయంలో మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారని, అటువంటి వారికి అభినందనలు తెలపాల్సిన ప్రధాని తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించామని చెబుతున్నారని, గతంలో సర్జికల్ స్ట్రైక్ పేరుతోనూ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారని, మరి ఇప్పటి ఉగ్రవాదులు ఎక్కడ నుండి వచ్చారని లోకనాథం ప్రశ్నించారు. అత్యంత సున్నిత ప్రాంతమైన పహల్గాంలోకి ఉగ్రవాదులు ఎలా చొరబడ్డారో కేంద్రం ఇప్పటి వరకూ బయట పెట్టలేదన్నారు. వారిని పట్టుకోలేదని, పైగా ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరిగా బిజెపి నాయకులు వర్ణించడం అత్యంత సిగ్గుచేటైన విషయమని అన్నారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు మోడీ సోఫియా కుటుంబ సభ్యులతో ప్రదర్శన జరిపి రాజకీయం చేశారని అన్నారు. బిజెపికి మద్దతు ఇస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ముస్లిములు పాకిస్తాన్‌కు వెళ్లిపోవాలంటూ ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతున్నారని అన్నారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఆయన ఇలా మాట్లాడటం సరికాదన్నారు. లౌకికపార్టీ అని చెప్పుకుంటున్న టిడిపి కూడా దీనికి సమాధానం చెప్పాలన్నారు. సిపిఎం దేశంలో సమైక్యతకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ని ఆపేస్తున్నారని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. బిజెపి నాయకుల తీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. సైనికులు, ప్రజలు మోడీ కాళ్లకు దండం పెట్టాలని చెబుతున్నారని, ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యన్నారాయణ, ఆర్.శంకరరావు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విశాఖ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024-25 సంవత్సరానికి నిర్వహించిన ఎస్ఒఎఫ్ ఒలింపియాడ్ పరీక్షలో విశాఖపట్నానికి చెందిన ముగ్గురు విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని ఎస్ఒఎఫ్ వ్యవస్థాపక డైరెక్టర్ మహబీర్ సింగ్ తెలిపారు. గురువారం ఉదయం పెదవాల్తేరులోని ఓ ప్రయివేటు స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలో విశాఖలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుండి శ్రేయాన్స్ కుమార్ సింగ్ అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంకు సాధించి బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్ పొందారని, అదేవిధంగా టింపనీ పాఠశాలకు చెందిన బి.సుహాస్ అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో రెండో ర్యాంకు సాధించి వెండి పతకం, మెరిట్ సర్టిఫికెట్‌ను. ప్రియాంక విద్యాయోదయ ఉన్నత పాఠశాల నుండి వచ్చిన కాండ్రపు వంశీ కృష్ణారెడ్డి అంతర్జాతీయ గణిత శాస్త్ర ఒలింపియాడ్‌లో మూడవ ర్యాంకును సాధించి మెరిట్ సర్టిఫికెట్‌తో కాంస్య పతకాన్ని సాధించారని వెల్లడించారు. ఈ సంవత్సరం ఎస్ఒఎఫ్ ఒలింపియాడ్‌లో విశాఖపట్నం నుండి 45600 మందికిపైగా విద్యార్థులు సహా 70 దేశాల నుండి సుమారు మిలియన్ల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. టింపనీ పాఠశాల, ప్రియాంక విద్యాయోదయ ఉన్నత పాఠశాలతో సహా విశాఖపట్నం నుండి ప్రముఖ పాఠశాలలు పాల్గొన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఎనిమిది ఒలింపియాడ్ పరీక్షలలో ర్యాంక్-1 విజేతలకు అంతర్జాతీయ బంగారు పతకం, రూ.50 వేలు, ర్యాంక్-2 విజేతలకు రూ.25 వేలు, వెండి పతకం, ర్యాంక్-3 హోల్డర్లకు రూ.10 వేలు, కాంస్య పతకం అందజేశామన్నారు.

డిఎ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిఎల విషయంలో గత ప్రభుత్వం ఉద్యోగస్తులను మోసం చేసిందని, కూటమి ప్రభుత్వమైనా స్పందించి తక్షణమే డిఎల బకాయిలు చెల్లించాలని ఎపి జెఎసి అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జివోస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ఆ మేరకు పిఆర్‌సి, ఐఆర్, పాత బకాయిల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మీద గౌరవంతో బకాయిల కోసం కోర్టులకు వెళ్లడం లేదని స్పష్టం చేశారు. ఉద్యోగుల బకాయిల్లో కేవలం 10 శాతం మాత్రమే ఇచ్చారని, నాలుగు డిఎల బకాయిలు ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో జీతం ఎప్పుడొచ్చేదీ తెలిసేది కాదని, ఈ ప్రభుత్వంలో ఒకటో తేదీకి జీతం వస్తోందని చెబుతూ ఆనందం వ్యక్తం చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం కూడా పిఆర్‌సి కమిషన్ వేయడానికి మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. వేరే రాష్ట్రాల్లో కోర్టులకు వెళ్లి డిఎల బకాయిలు సాధించుకున్నారని గుర్తు

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఆరేడు వేల కోట్లు, ప్రస్తుత ఉద్యోగులకు రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం బకాయిలు ఉందని వివరించారు. ఉద్యోగ ఆరోగ్య స్కీమ్.. ఉద్యోగ ఆరోగ్య స్కాంగా మారిందని విమర్శించారు. ఒక ఉద్యోగి అనారోగ్యంతో రూ.5 లక్షలు ఖర్చు చేస్తే రూ.90 వేల బిల్లు మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగ సంఘాల నేతలకు సిఎం చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని చెప్పారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎపి జెఎసి అమరావతి విశాఖ చైర్మన్ సత్తి నాగేశ్వరరావు రెడ్డి, కార్యదర్శి కెఎస్.రావు, నాయకులు అప్పలరాజు, డి.వెంకటరావు పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రతినెలా మెడికల్ క్యాంపులు నిర్వ హిస్తున్న నేపథ్యంలో గురువారం మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజ్ఞాన కేంద్రం చైర్మన్ వివిఎస్. పద్మనాభరాజు ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపులో బిపి, సుగర్, ఇసిజితోపాటు కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చారు. వీటితోపాటు కంటి పరీక్షలు నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్స్ నుంచి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రవణ్, డాక్టర్ రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులు మెడికవర్ హాస్పటల్ వారికి, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం నాయకులు టి.కామేశ్వరరావు, ప్రజారోగ్య వేదిక నాయకులు ఐకె.శేషు, పిపిసి నాయకులు శ్రీకాంత్, చంద్రమౌళి పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిరాశ్రయ, అనాథ బాలలకు ఆధార్ కార్డులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిరాశ్రయులు, అనాథలు అయిన బాలలకు ఆధార్ కార్డులను ఉచితంగా అందజేసేందుకు ప్రత్యేకంగా శిబిరాలను నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ (విశాఖపట్నం) అధ్యక్షులు చిన్నంశెట్టి రాజు సూచనల మేరకు ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు.

పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెప్టెన్ కూల్ పేరుతో డెటాల్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నగరంలో పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సం దర్భంగా మెక్‌కాన్ సంస్థ ప్రతినిధి ప్రసూన్ జోషి మాట్లాడారు.

LOSS OF PASSPORT

I, MOHAMMED ANSARWALI
S/o. Mohammed Ibrahim,
D.No. 2-32, Kanithinaidu palem,
Islampeta, Pedagantyada,
Visakhapatnam-530031.
I Lost My Original Passport
Vide Passport No. **Y 7698646**
Date of Issued 13-09-2023.
While Iwas traveling from
Duvvada Railway Station to
Kurmanapalem Junction by
Bike on 01-05-2025.
If Anybody found
please contact me.
Cell : 8978360956

IN THE HON'BLE COURT OF THE 1st ADDL CIVIL JUDGE (SENIOR DIVISION), AT VISAKHAPATNAM.
EP.No. 10/2024 IN O.S.1872/2012

Between:
Konthala Suri Jaggarao . . . D.Hr/Petitioner.
And
1.Smt. Vantakula Chaya
2. Sr Vantakula Veerabhadra Prasad . . . J.Drs/Respondents.

ORDER 21 RULE 64
NOTICE TO JDRS

To
1.Smt. Vantakula Chaya
W/o. Veerabhadra Prasad,
Hindu, aged about 53 Years.
R/at D.No.48-13-31, Indira Bhavan,
Srinagar. Near Ramatalkies,
Visakhapatnam.
2.Sri Vantakula Veerabhadra Prasad
S/o. Apparao, Hindu,
aged about 60 Years, Rest-do-

Please take notice that the above numbered Execution Petition E.P.No. 10/2024 in O.S.No. 1872/2012 filed by the decree holder stands posted to **18-6-2025** for your appearance before the Hon'ble 1st Addl. Civil Judge (Senior Division), Visakhapatnam.

Therefore, you are hereby called upon to appear either in person or by pleader before the Hon'ble court on **18-6-2025 at 10.30 A.M** in default for your appearance on that day and hour mentioned the above EP will be heard ex parte in you absence and proceed further in accordance with law.

(By order of the Hon'ble court)

A.S.V.PRASAD
Advocate, Anakapalli.
Cell : 9440787552.

IN THE HONOURABLE COURT OF THE V ADDL.JUNIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM
O.S.No. 383/2023

Between:
ICICI Bank Ltd., . . . Plaintiff
And:
Sri. Setty Lingayya . . . Defendant

SUMMONS TO DEFENDANT

To
Sri Setty Lingayya,
S/o. Sri Pandu settee,
D.No.9-18, New Colony,
Parawada,
Visakhapatnam - 531021.

Please take notice that the Petitioner/Plaintiff herein filed above suit for Directing the defendants to pay an aggregate sum of Rs. 13,66,828.99 (Rupees Thirteen Lakhs Sixty Six Thousand Eight Hundred Twenty Eight and Ninety Nine Paise only) and for costs and other relief's, the same is posted for your appearance in the above named court on **16-06-2025 at 10-30 A.M.** in person or through a Pleader duly instructed to answer the questions relating to the above proceedings and in default of your appearance on the aforesaid day, the case will be will be determined in your absence.

// BY ORDER OF THE HONOURABLE COURT //
Smt. B.ANANTHA LAKSHMI
ADVOCATE
Visakhapatnam.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.11/ 2024, in O.S.214/ 2016

బిట్వీన్:
ప్రగడ రామారావు, తండ్రి లేటు గోవిందరాజులు, హిందూ, వయసు 60 సం॥లు, సబ్‌స్టేషన్ దగ్గర, న్యూకాలనీ, పరవాడ విలేజ్ అండ్ మండలం, అనకాపల్లి జిల్లా . . . **DHR**
మరియు:
పైలా రేగారావ్, తండ్రి లేటు అప్పలనాయుడు, హిందూ, వయసు 45 సం॥లు, వెన్నెలపాలెం విలేజ్, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా. . . .**JDR**

వేలం ప్రకటన

పై నెంబర్ డిక్రీ బాకీ రాబట్టు నిమిత్తం **JDR** యొక్క ఈ దిగువ షెడ్యూలు చిరాస్తిని తే:19-6-2025న వేలం వేయుటకు శ్రీకోర్టు వారు నిర్ణయించి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10-30 ని॥ల నుండి సాయంత్రం 5 గంటల లోపు పై కోర్టులో వేలం వేయబడును. కావున వేలంపాటలో పాల్గొదలచిన వారు శ్రీకోర్టు వారి షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

వేలం ఆస్తి వివరం షెడ్యూలు

అనకాపల్లి జిల్లా, లంకెలపాలెం సబ్ రిజిస్టర్ పరవాడ మండలం, ఎదులపాక బోనంగి రెవెన్యూ విలేజ్ పరిధిలో గల సర్వేనెం. 394/4లో ఎకరా 0.20 సెంట్లు డ్రై లాండ్‌కు హద్దులు
తూర్పు : పైల కృష్ణగారి భూమి
పడమర : బండారు సూరిబాబు, పైలా కృష్ణ వగైరాలు
ఉత్తరం : బండారు అప్పారావుగారి భూమి
దక్షిణం : పైలా సూర్యనారాయణగారి భూమి

డి.హెచ్.ఆర్. విలువ రూ. 2,00,000/-
అమీనా విలువ రూ. 5,00,000/-
మార్కెట్ విలువ రూ. 11,00,000/-

సిహెచ్.ఎస్.ఎస్.రామచంద్రరావు
అడ్వకేట్, అనకాపల్లి.
సెల్: 98482 94226

సామయ్యవలసలో వరుస చోరీలు!

- ఏడాదిలో ఆరు సార్లు : ఊరి దొంగల పనేనని అనుమానం
- ఉదయం పూటనే... ఇంట్లో లేని సమయంలోనే ఘటనలు
- భారీగా బంగారు ఆభరణాలు, నగదు అపహరణ
- అనుమానితుల పేర్లతో పోలీసులకు రామలక్ష్మి ఫిర్యాదు
- చర్యల్లో అలసత్వంపై బాధితుల్లో ఆందోళన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పొంద్రంగి పంచాయతీ సామయ్యవలస గ్రామంలో ఏడాది కాలంలో వరుసగా ఆరు దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. బాధితులు ఉదయం పూటన పొలం పనులు, ఇటుక బట్టీలకు వెళ్లే సమయంలో, వారి ఇళ్లల్లోకి చొరబడి చోరీలకు పాల్పడుతుండం, ఘటనలన్నీ ఒకే మాదిరిగా వేకువజాము నుంచి ఉదయం 9గంటల్లోపు ఒకే సమయంలో జరుగుతుండడాన్ని బట్టి, బాధితుల కదలికను పసిగట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారని స్పష్టమౌతోందని గ్రామస్తులు అంటున్నారు. ఇది తెలిసిన వారు, గ్రామంలోని వారే దొంగతనాలకు పాల్పడ్డారని స్పష్టం కావడంతో ఫిర్యాదు చేయడానికి బాధితులు భయపడే పరిస్థితి ఉంది. రామలక్ష్మి అనే బాధితురాలు తెగించి, అనుమానితుల పేర్లతో స్థానిక పోలీసులతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తక్షణ చర్యలు లేకపోవడంతో ఆమెపై వేధింపులు, దాడులకు తెగబడుతున్నారని ఆందోళన చెందుతోంది.

సామయ్యవలసలో జరిగిన వరుస చోరీ ఘటనల తీరును పరిశీలిస్తే, మొదటగా, షావుకారి రాజు ఇంట్లో ఉదయం 8 9 గంటల మధ్యలో 15 తులాలు బంగారం, 30 తులాలు వెండి, రూ.రెండు లక్షల నగదు చోరీకి గురైంది. ఎడ్ల రమణ ఇంట్లో వేకువజామున నాలుగు గంటలకు దంపతులిద్దరూ ఇటిక బట్టీలకు వెళ్లిన సమయంలో మూడున్నర తులాల బంగారం, రూ. 40వేల నగదు ఎత్తుకుపోయారు. ఇజ్జాడ రమణ అనే బాధితుడి ఇంట్లో ఉదయం 6:30 గంటల సమయంలో నాలుగున్నర తులాల బంగారంచ రూ. రెండు లక్షల నగదు. పల్లి రమణ ఇంట్లో మూడు తులాల బంగారం, రెండు లక్షల నగదు, సుంకర నారాయణ ఇంట్లో రెండు తులాల బంగారం, రూ. 30 వేల నగదు అపహరణకు గురైంది.

తాజాగా గతనెల 17న రొంగలి రామలక్ష్మి ఇంట్లోనూ వేకువజామున ఆరుగంటల సమయంలోనే ఇంట్లోని బీరువాను పగలగొట్టి, 9తులాల బంగారం, రూ.90వేల నగదు దోచుకున్నారు. తన భర్త సాధుతో కలిసి సాధు ఇంటికి సమీపంలో ఉన్న మల్లె తోటలో పూలు ఏరేందుకు వెళ్లిన సమయంలోనే దొంగతనం జరిగిందని, అనుమానితుల పేర్లలో గతనెల 18న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా దీనిపై చర్యలు లేకపోవడంతో గతనెల 22న జిల్లా కలెక్టర్‌కు, 25న పిజిఆర్ఎస్‌లోనూ ఫిర్యాదులు చేసింది. నెలన్నర రోజులు కావస్తున్నా దీనిపై ఎటువంటి చర్యలు లేకపోవడంపై బాధితురాలు ఆవేదన చెందుతోంది.

అనుమానిత పేర్లను వెల్లడించడంతో ఆమెపై ఒత్తిడి, వేధింపులు ఎక్కువయ్యాయని వాపోతోంది. ఒకే గ్రామంలో కొద్దిరోజుల వ్యవధిలోనే వరుసగా ఆరు చోరీ ఘటనలు జరగడం, భారీగా బంగారం, నగదు అపహరణకు గురైనా వాటిని నియంత్రించడంలోగానీ, చోరీ సొత్తు రికవరీలో ఆశించిన పురోగతి లేకపోవడంపై బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఊరి దొంగల పనేనని బాహాటంగా బాధితులు వెల్లడిస్తున్నా, వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని అనుమానాలు వ్యక్తమౌతోంది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి, దొంగతనాలను అరికట్టడంతోపాటు చోరీ సొత్తురికవరీ చేసి బాధితులకు భరోసానివ్వాలని కోరుతున్నారు.

కుటుంబ బంధాలను కాపాడుకోవాలి

మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-ములగాడ : ప్రతిఒక్కరూ కుటుంబ బంధాలను కాపాడుకోవాలని, తల్లిదండ్రులు, తోబుట్టువులు, అత్తమామలు, బంధువుల పట్ల తమ బాధ్యతలను నెరవేర్చాలని కార్మిక నాయకులు, సామాజిక కార్యకర్త బి.సత్యానందం అన్నారు. గురువారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో మాట్లాడుతూ, భారత సంస్కృతిలో కుటుంబమే బలమైన సంస్థ అని, దాని మూలాలను నిలబెట్టవలసిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. కుటుంబాలలో సంతోషం వెల్లివిరిస్తేనే దేశం సౌభాగ్యవంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నృత్యపోటీలను నిర్వహించారు. . షణ్ముం చేసిన నృత్యం అందర్నీ అలరించింది.కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి. అజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు లెమన్ స్పూన్ క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు జూన్ 6వ తేదీన ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి జనార్దన్ తెలిపారు.

సింహాద్రి అప్పన్న నిత్యాన్నదానానికి రూ.1,00,116 వితరణ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన ప్రసాదానికి విశాఖపట్నం చిన్న ముషిడివాడకు చెందిన ఎస్.నర్సింగరావు, వరలక్ష్మి దంపతులు రూ 1,00,116 నగదును విరాళంగా అందజేశారు. దేవస్థానం పిఆర్ఓ కార్యాలయంలో సింహాద్రి అప్పన్న నిత్యాన్నదాన ప్రసాద కౌంటర్‌లో విరాళ నగదును చెల్లించి, రశీదు పొందారు.

విరాళదాతలకు దేవస్థానం పిఆర్ఓ కార్యాలయ సీనియర్ సహాయకులు వి. సూర్య నారాయణ స్వామివారి బొండును అందించారు. విరాళంపై వచ్చిన వడ్డీతో స్వామి సన్నిధిలో నిత్యాన్నదాన ప్రసాదాన్ని భక్తులకు అందజేయాలని దాతలు కోరారు. విరాళదాతలకు సింహాద్రి అప్పన్న ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు స్వామి ప్రసాదాలను అందజేశారు

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో అందని సాగునీరు

రెండేళ్లుగా బీడుగా మారిన పదెకరాల పంట భూమి : రైతులు మొర పట్టని అధికారులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నలుగురు రైతులకు చెందిన పదెకరాల వ్యవసాయ భూమి రెండేళ్లుగా సాగునీరు అందక బీడుగా మారిపోయిందని గ్రామ సర్పంచ్ కర్రి రమణ తెలిపారు. వెంకటాపురం గ్రామానికి నమ్మి అప్పన్న, నమ్మి సూర్యనారాయణ, గాలి అప్పలనాయుడు, పళ్ళ సన్ని బాబు అనే నలుగురు రైతులు తమకున్న పది ఎకరాల పొలాల్లో వ్యవసాయ బోరు కనెక్షన్లు వేసుకుని సాగు చేస్తున్నారు. దువ్వు వారి కల్లాలు నుంచి వీరి వ్యవసాయ బోర్లుకు ఏడు విద్యుత్ స్తంభాలు మీదుగా కరెంట్ లైన్ వేశారు. అయితే 2023లో రోడ్డుకు సమీపంలో ఉన్న ఒక విద్యుత్‌స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆస్తంభం విరిగిపోవడంతోపాటు దానికి ఆనుకొని ఉన్న మిగిలిన విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి. దీనిపై అప్పట్లోనే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించకపోవడంతో వారి వ్యవసాయ బోర్లకు కరెంటు సరఫరా లేకపోయింది. దీంతో సాగునీరు అందక వారు పంటలు వేసుకోలేని పరిస్థితి నెలకొని, రెండేళ్లుగాఆయా పంటపొలాలు బీడులుగా మిగిలి పోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై స్థానిక సర్పంచ్ రమణ పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో సమస్యలను లేవనెత్తడంతోపాటు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టరు గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేసినా, ఎటువంటి కదలిక లేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైతులకు వ్యవసాయమే జీవనోపాధి అయిన పరిస్థితుల్లో విద్యుత్‌శాఖ అధికారుల నిర్వాకంతో నలుగురు రైతులు పంటలు వేసుకోలేని దుస్థితి కల్పించడం దుర్మార్గమని, ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని సర్పంచ్ కోరుతున్నాడు. ఆయాపొలాల్లో వరి, మొక్కజొన్న, మిరప, అరటి, దొండ, పూల తోటలు సాగుచేసుకుని రైతులు జీవనాధారం పొందుతున్నారన్నారు.

దళితులపై చిన్నచూపు తగదు

నిరసనలో మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి-ములగాడ : దళితుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేదని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) విశాఖ జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు ఆరోపించారు. గురువారం జివిఎంసి 63వ వార్డు కాకర్లలోవ భగత్ సింగ్ జంక్షన్‌లో డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాలతో దళితులకు మేలు జరుగుతుందని భావించినా, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి విశాఖపట్నంలో 3 లక్షలకు పైగా ఉన్న దళితులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 400 యూనిట్లు మంజూరు చేయడం అన్యాయమని మండిపడ్డారు. దళితులకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్నారు. ఇటీవల తెనాలిలో దళిత యువకులను పోలీసులు నడిరోడ్డుపైనే దాడికి తెగబడడం దుర్మార్గమని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో జిల్లా దళిత నాయకులు జి సాంబమూర్తి, టి.కామేశ్వరరావు, ఎస్అప్పారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

గంటల వ్యవధిలో తండ్రీకొడుకుల మృత్యువాత

గండిగుండం గ్రామంలో విషాదం

మృతి చెందిన తండ్రీ కొడుకులు అచ్చిరాజు, బంగారయ్య (ఫైల్)

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోనిగండిగుండం గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన తండ్రికొడుకులిద్దరూ 12 గంటల వ్యవధిలో మృత్యువాత పడడంపై గ్రామంలో విషదఛాయలు అలుముకున్నాయి. వివరాలివి.

గ్రామానికి చెందిన మదపాడ అచ్చిబాబు (80)కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్నారు. డీహైడ్రేషన్ కారణంగా పరిస్థితి విషమించడంతో బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. తండ్రి మరణవార్త వార్త విని పెద్ద కుమారుడు మదపాడ బంగారయ్య (52) తీవ్రంగా కలత చెందాడు. గతంలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న బంగారయ్య అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు వెంటనే విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో ఆరోగ్యం విషమించడంతో బంగారయ్య కూడా తనువు చాలించాడు. బంగారయ్య వ్యవసాయ కూలిగా జీవనం సాగిస్తున్నాడు. . అతనికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమారులు మహేష్, రాజేష్ ఉన్నారు. కుమారులిద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. తాతయ్య, తండ్రి మరణవార్త విన్న బంగారయ్య పెద్దకొడుకు మహేష్ కూడా తీవ్ర ఆందోళనకు గురై ఆసుపత్రిలో చేరాడు. భర్త, మామల మరణాన్ని తట్టుకోలేని అన్నపూర్ణ కూడా షాక్‌కు గురై ఆసుపత్రి పాలైంది. తండ్రి, కొడుకుల మరణం ఆ కుటుంబాన్ని తీరని విషాదంలో నింపడంతోపాటు, మరికొందరి కుటుంబసభ్యులు అనారోగ్యం పాలవ్వేలా చేయడంపై గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులైతే శోకంలో మునిగిపోయారు. అచ్చి బాబు రెండవ కుమారుడు మదపాడ శ్రీను తండ్రి, అన్నయ్య మృతదేహాలకు గంట వ్యవధిలో దహన సంస్కారాలను నిర్వహించారు. గ్రామస్థులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.గంటల వ్యవధిలోనే ఇంటి పెద్దలు, కుటుంబపోషణధారం కోల్పోవడంతో గ్రామమంతా దిగ్భ్రాంతికి గురైంది. తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి.

విద్యార్థులకు స్కౌట్స్ సర్టిఫికెట్స్ అందజేత

సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం, తదితరులు

ప్రజాశక్తి-మధురవాడ : సమాజంలో విలువల పరిరక్షణకు బాల సారధులే స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి అన్నారు. గురువారం స్కౌట్స్ అండ్ గైడ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లను పాఠశాలలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ శిక్షణ పొంది రాజ్య పురస్కార్ సాధించిన విద్యార్థులు వివిధ ఉన్నతస్థాయి విద్యాభ్యాసంలో, ఉద్యోగ సాధనలో ప్రాధాన్యత పొందుతారన్నారు. స్కౌట్స్ జిల్లా కార్యదర్శి డి.వేణుగోపాల్ మాట్లాడుతూ రాజ్య పురస్కార్ అనంతరం ఒక సంవత్సరం శిక్షణ పొంది రాష్ట్రపతి జారీచేసే సర్టిఫికెట్ పొందవచ్చని, తద్వారా అనేక సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా కమిషనర్ ఆర్. మధుసూదనరావు, రాష్ట్ర సహాయ కమిషనర్ అహమ్మద్ షరీఫ్, గైడ్ కెప్టెన్ జి.ఉషారాణి, కెఎల్. ప్రసన్నకుమారి, స్కౌట్ మాస్టర్ ఎస్.సోమేశ్ పాల్గొన్నారు

హరిత విశాఖగా తీర్చిదిద్దుదాం

- ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్

మట్టి నీటి కుండీలను అందజేస్తున్న నీరజ్‌కుమార్

ప్రజాశక్తి -మధురవాడ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎపి ఎన్‌సిసి 13వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్, కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ అన్నారు. గురువారం రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్‌సిసి వార్షిక శిక్షణ శిబిరం (ఎటిసి-4) కార్యక్రమాల్లో భాగంగా గ్రీన్ క్లైమేట్ టీం, జివిఎంసితో కలిసి హరిత విశాఖ సాధన అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, విశాఖను హరిత నగరంగా తీర్చిదిద్దడానికి ఎన్‌సిసి కూడా పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇఎన్‌వి నరేష్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పరిరక్షణకు జివిఎంసి చేస్తున్న కృషిని వివరించారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల జరిగే అనర్థాలు వివరించారు. చెత్త నిర్వహణపై నగర ప్రజలకు అవగాహన కల్పించడానికి విద్యార్థులు తమ వంతు బాధ్యత తీసుకోవాలన్నారు. జివిఎంసి సస్టైనబుల్ రిజిలియన్స్ యూనిట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ స్వప్న మాట్లాడుతూ విపత్తుల సమయంలో ఎన్‌సిసి పాత్రకీలకంగా ఉండాలని కోరారు. ప్రతిఒక్కరూ వేసవి కాలంలో పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి .జెవి. రత్నం, ఎస్ఆర్‌యూ, జివిఎంసి సీ ప్రాజెక్ట్ ఇంజినీర్ దాట్ల వివేకవర్మ, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిం, సుబేదార్ మేజర్ శ్రీనివాస్, సుబేదార్ సుహాన్‌సింగ్, సునీల్‌సింగ్, రవీంద్రసింగ్, అసోసియేట్ ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ భాస్కర్, అనంతరావు, ఎ.కల్యాణ్ అశోక్, ఉమానాగేశ్వరి, చీఫ్ ఆఫీసర్ వి.లత, లెఫ్టినెంట్ బి.సన్యాసిరావు పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో

వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటన

ప్రజాశక్తి -భీమునిపట్నం : కేంద్ర వ్యవసాయ శాఖ నేతృత్వంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసిఎఆర్)లోని విభాగాల వారీగా నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కూడిన బృందం, జూన్ 2,3 తేదీల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించనుందని వ్యవసాయ శాఖ, భీమిలి అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ గురువారం తెలిపారు. 2న పద్మనాభం మండలం కొవ్వాడ, మద్ది, బాందేవుపురం, 3న ఆనందపురం మండలం బోని, వెల్లంకి, ఆనందపురం గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. వరితోపాటు కూరగాయలు, పూలు, ఉద్యాన పంటలు విస్తారంగా పండించే గ్రామాలను వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటనకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పలు అంశాలపై రైతులకు వీరు అవగాహన కల్పిస్తారన్నారు. అనకాపల్లి జిల్లా, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కొత్త వంగడాలపై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

టిడిపికి రూ.25 లక్షల విరాళం

మహానాడులో అందజేసిన సీతంరాజు సుధాకర్

ఆన్‌లైన్‌లో నగదు బదిలీని చంద్రబాబుకు చూపుతున్న సుధాకర్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్/ సీతమ్మధార : విశాఖ దక్షిణ నియోజకవర్గ టిడిపి బాధ్యులు సీతంరాజు సుధాకర్ తెలుగుదేశం పార్టీకి రూ.25 లక్షల విరాళం అందజేశారు. కడప జిల్లాలో జరుగుతున్న మహానాడులో నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని రూ.25 లక్షలు చెక్కును పార్టీకి అందజేశారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు ఉరికిటి నారాయణరావు, విల్లూరి భాస్కరరావు, గొలగాని వీరారావు, మాజీ కార్పొరేటర్ గోడి నరసింహాచారి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

సిమెంట్ ధరలు నియంత్రించకపోతే

భవన నిర్మాణాలు చేయలేం.!

ట్రేడర్స్ సిండికేట్‌తో అనూహ్యంగా ధర పెరుగుదల

ప్రభుత్వ జోక్యానికి బిల్డర్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి- పెందుర్తి : అనూహ్యంగా పెరిగిపోతున్న సిమెంట్ ధరలను నియంత్రించకపోతే భవిష్యత్తులో నిర్మాణాలు సాగించలేమని జివిఎంసి ఎనిమిదో జోన్‌లోని బిల్డర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. మార్చి నుంచి నేటి వరకూ గడిచిన మూడు నెలల్లో పెరిగిన ధరలు యావత్తు నిర్మాణ రంగాన్నే భయపెట్టేవిలా ఉన్నాయంటూ అసోసియేషన్ పత్రికా ప్రకటనలో పేర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆకాశాన్నంటిన ఇసుక ధరలను కిందకు తెచ్చి నిర్మాణరంగానికి ఇసుకను అందుబాటులోకి తెచ్చారనుకుంటే, సిమెంట్ ధరల అనూహ్య పెరుగుదల గందరగోళానికి గురిచేస్తోందన్నారు. మార్చి నెలలో రూ.250 దాకా ఉన్న సిమెంట్ బస్తా ఇపుడు రూ.370కి చేరిపోయిందని, ఇది అనూహ్య పెరుగుదల అన్నారు. నిర్మాణ రంగానికి అతి కీలకమైన సిమెంట్ విషయంలో ట్రేడర్స్ సిండికేట్‌గా ఏర్పడి కృత్రిమ కొరతను సృష్టిస్తూ ధరల పెరుగుదలకు కారణమౌతున్నారని అసోసియేషన్ ఆరోపించింది. సిమెంట్ ధరలు ఇదే తరహాలో భవిష్యత్తులోనూ కొనసాగితే నిర్మాణ రంగం కుదేలైపోవడం ఖాయమన్నారు. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న నిర్మాణ రంగాన్ని దెబ్బతీస్తున్న సిమెంట్ ధరల పెరుగుదలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అసోసియేషన్ కోరింది. ధరలను నియంత్రించి, ఎందరికో ఉపాధిగాఉన్న భవన నిర్మాణ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ కోరింది.

నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

బహుమతులతో విద్యార్థులు

ప్రజాశక్తి -ములగాడ : నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సిహెచ్ఆర్‌ఒ అరుణ్ లెస్లీ జార్జ్ అన్నారు. గురువారం కోరమాండల్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం ప్లాంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కోరమండల్ ఉద్యోగుల పిల్లలతోపాటు శ్రీహరిపురం జివిఎంసి ఉన్నతపాఠశాల విద్యార్థులు వందమందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా తామర, లిల్లీ పుష్పాలతో అలంకరించిన వాటర్‌గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ్ లెస్లీ జార్జ్ మాట్లాడుతూ, నీటిసంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై కోరమండల్ సంస్థకు ఉన్న నిబద్ధతను ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలుపుతోందన్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లలు తమ ఇళ్లల్లో, సమాజంలో నీటిసంరక్షణ, పర్యావరణ పరిరక్షణ రాయబారులుగా తీర్చిదిద్దడం లక్ష్యమన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వారిలోని సృజనాత్మకను వెలికితీసేందుకు కోరమండల్ సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానసుందరం పర్యావరణం, ఆరోగ్యం, భద్రత విభాగాధిపతి డి. నాగరాజుచ ఇహెచ్ఎస్ నాగార్జున, కోరమండల్ లేడీస్ అసోసియేషన్ సిఎల్ఎ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారితోపాటు పాల్గొన్న వారికి బహుమతులను అందజేశారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార : విశ్వవిఖ్యాత నటసార్వభౌమ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా పౌర గ్రంథాలయంలో శారదా కళానికేతన్ ఆధ్వర్యంలో సంగీతవిభావరి నిర్వహించారు. ఎన్టీ రామారావు నటించిన సినిమాల్లో పాటలను గాయనీగాయకులు పాడి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో శారదా కళానికేతన్ సంస్థ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, రాములు ,ఇందిరా,పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం : డిఎంహెచ్ఒ

వాల్తేరు యుపిహెచ్‌సిలో సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. గురువారం చినవాల్తేర్ యుపిహెచ్‌సిని సందర్శించి, ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో అన్ని ఆరోగ్య ఇండికేటర్స్ చాలా తక్కువగా ఉండటంతో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆరోగ్యకేంద్రంలో ఉండి విధులు నిర్వహించాల్సి ఉండగా, 12.30గంటల తర్వాత కొంతమంది కనిపించడం లేదన్నారు. ఆశా కార్యకర్తలు,ఎఎన్ఎంలు ఒక ప్రణాళికా ప్రకారం సిద్ధం చేసుకుని సాయంత్రం 4గంటల వరకు క్షేత్ర సందర్శనలో ఉండి అభ ఐడి నమోదు, ఎన్‌సిడిసిడి సర్వే వచ్చేనెల 15లోగా శతశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. వీరితో డ్యూటీ చార్ట్ ప్రకారం పనిచేయించాల్సిన బాధ్యత వైద్యాధికారిపై ఉందని ఆదేశించారు. డ్యూటీ చార్ట్ ప్రకారం సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని, అలాగే నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. లేకుంటే ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు సంబంధిత ప్రోగ్రాం అధికారి నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. సందర్శనలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లూసీ, ఎన్‌సిడి ఆర్‌బిఎస్‌కె. జిల్లా సమన్వయకర్త డాక్టర్ బి.హరిక, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో కోవిడ్ మరణాలు లేవు

-డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లాలో తాజాగా ఎటువంటి కోవిడ్ మరణాలు చోటుచేసుకోలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ .పి.జగదీశ్వరరావు వివరణనిచ్చారు. విశాఖలో కోవిడ్ వ్యాధితో 60ఏళ్ల దాటిన వ్యక్తి మృతి చెందినట్లు కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురికాకుండా ఉండేందుకు దీనిపై స్పష్టతనిస్తూ ప్రకటన విడుదల చేశారు.

జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి కోవిడ్ మరణాలు జరగలేదన్నారు. న్యుమోనియా, పార్కిన్సన్స్ వ్యాధి, అధిక రక్తపోటు, మధుమేహం వంటి పలు కారణాలతో వ్యక్తి మృతి చెందాడని అంటున్నారని, అటువంటి సమాచారం కూడా తమ వద్ద లేదన్నారు. . కోవిడ్ మరణాన్ని ధ్రువీకరించాలంటే కెజిహెచ్‌లో విఆర్‌డిఎల్ ల్యాబ్‌లో ఆర్‌టిపిసిఆర్ టెస్ట్ పాజిటివ్‌గా నిర్ధారణ కావాల్సి ఉంటుందన్నారు. ప్రజలెవరూ భయాందోళనలకు గురి కానవసరం లేదన్నారు. అయినప్పటికీ కోవిడ్ నియమ నిబంధనల ప్రకారం మాస్క్ ధరించడం, శానిటైజర్ వినియోగించడం వంటివి చేయాలని సూచించారు.

గురుకులంలో శిథిల గదుల తొలగింపునకు

4న బహిరంగ వేలం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న పాత భవనాల గదుల తొలగింపునకు వచ్చేనెల 4న, బుధవారం ఉదయం 11గంటలకు పాఠశాలలోనే బహిరంగ వేలం వేయనున్నట్లు ప్రిన్సిపల్ జయప్రకాశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని గురుకులంలో పాతబడి, ప్రమాదకర స్థితిలో ఉన్న డైనింగ్ హాల్, వంట గది, స్టోర్ రూమ్, ఇతర గదుల తొలగించనున్నట్లు వెల్లడించారు. షరతులకు లోబడి వస్తువులను తీసుకెళ్లాల్సి ఉంటుందని, వేలంపాటదారులు గమనించాలని సూచించారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 87126 25025, 83095 19107 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపల్ జయప్రకాశ్ సూచించారు

నేడు విద్యుత్తుకు అంతరాయం

ప్రజాశక్తి-మధురవాడ : ఎపిఇపిడిసిఎల్ పిఎం.పాలెం సెక్షన్ పరిధిలోని 33/11కెవి క్రికెట్ స్టేడియం సబ్‌స్టేషన్, 11కెవి సప్తగిరి ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల దృష్ట్యా ఈనెల 30న శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు సంస్థ మూడోజోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. లా కాలేజీ రోడ్డు, వాణిజ్యపురి లేఔట్, గుప్తా లేఔట్, బింద్రా నగర్, పీర్లేస్ కాలనీ, కారుషెడ్ జంక్షన్, సప్తగిరి కాలనీ, తారకరామనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హైడ్రో పవర్ ప్లాంటు నిర్మాణాన్ని అడ్డుకుంటాం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి, మారిక గ్రామాల మధ్యలో అదాని హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని, లేదంటే అడ్డుకుంటామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పేర్కొన్నారు. అనకాపల్లి దొడ్డి రామునాయు భవన్లో గురువారం సిపిఎం పార్టీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ అదాని లూప్ పంపుడు స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం విజయనగరం జిల్లా వేపాడ మండలం మారిక, దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీల పరిధిలో ఇచ్చిన నోటిఫికేషన్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మారిక గ్రామానికి బుధవారం రెవెన్యూ శాఖ అధికారులు, సామాజిక నిపుణులు అదాని మనుషులను తీసుకొని వెళ్లి ఆదివాసీ గిరిజనులను భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రభుత్వం అన్నిరకాల అనుమతులు పొందిన తరువాత అదాని మనుషులను తీసుకువెళ్లాలని, అదేమీ జరగకుండా అదాని మనుషులను రౌడీలను తీసుకొని వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరారు. ఇంతకు మించి అధికారులు, ప్రభుత్వం ముందుకు వెళితే ప్రతిఘటించక తప్పదని హెచ్చరించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అడవి బాట పట్టడమంటే అడవులను తాకట్టు పెట్టడం కాదన్నారు. గిరిజనుల బతుకులు నాశనం చేయడానికి అడవి బాట పట్టినట్లు గిరిజనులకు అర్థమౌతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కడితే రైతులకు సాగు నీటికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. వేపాడ మండలం కరక వలస పంచాయతీ శివారు మారికలో 213 ఎకరాలు భూమి తీసుకొని హైడ్రోపవర్ పవర్ ప్లాంట్ను నిర్మాణం చేయాలనే నిర్ణయాన్ని అక్కడ గిరిజనులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. గిరిజనుల అభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎటువంటి పనులు చేపట్టాలని చూసినా తీవ్రమైన ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

ఇప్పటికే అదాని కంపెనీకి చెందిన ఏజెంట్లు ఈ ప్రాంతాన్ని చుట్టు ముట్టారని తెలిపారు. ఈప్రాంతంలోని నివాసం ఉంటూ పవర్ ప్లాంట్ పనులు ప్రారంభించాలని నిర్ణయించారన్నారు. రైవాడ ఆయకట్టు కింద ఉన్న గ్రామాల సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, నీటి సంఘాల చైర్మెన్లు స్థానిక ప్రజా ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా రైతులను చైతన్యం చేసి జోక్యం చేసుకొని గిరిజనుల, రైతులను పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణం జరిగితే దేవరాపల్లి మండలంలోని చింతలపూడి కొండగంగుబూడి, కరకవలస, తామరబ్బ, కల్యాణి గుమ్మి, వీలుపర్తి పంచాయతీలో సగం గ్రామాలకు రైవాడ ప్రాజెక్టుకు గల ఆయకట్టు భూముల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

టెన్త్ రీ వాల్యుయేషన్లో విద్యార్థి ఉత్తీర్ణత

ప్రజాశక్తి-దేవరాపల్లి : పదవ తరగతి మూల్యాంకనంలో జరిగిన తప్పిదం వల్ల ఓ టెన్త్ విద్యార్థి ఫెయిల్ కాగా, రీ వాల్యుయేషన్లో ఉత్తీర్ణత సాధించాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.... దేవరాపల్లి మండలం తెనుగుపూడి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి లింగాల ఆకర్ష్ ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు రాశాడు. ఎస్ఎస్సి బోర్డు విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో అన్ని సబ్జక్టుల్లో ఉత్తీర్ణత సాధించగా సాంఘికశాస్త్రంలో కేవలం 18 మార్కులే రావడంతో ఆ విద్యార్థి, తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. పరీక్ష పేపరు మూల్యాంకనంపై అనుమానం వచ్చిన వారు ఎస్ఎస్సి బోర్డుకి రూ.1000 చలానా కట్టి సాంఘిక శాస్త్రం జవాబు పత్రాన్ని రీ వాల్యుయేషన్ చేయించారు. రీ వాల్యుయేషన్ 65 మార్కులు వచ్చాయంటూ ఎస్ఎస్సి బోర్డు నుంచి బుధవారం సాయంత్రం లింగాల ఆకర్ష్ ఫోన్కి సమాచారం వచ్చింది. అంతే కాకుండా అతని జవాబు పత్రంలోని పేజీలను పంపించారు. దీంతో తన కుమారుడు పరీక్ష పోలేదని, పాసయ్యాడని తెలుసుకున్న అతని తల్లిదండ్రులు ఆనందానికి అవధులు లేవు. మొత్తంలో ఆకర్ష్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు.

లింగాల ఆకర్ష్

డీలర్ల ద్వారా రేషన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-యలమంచిలి

కూటమి ప్రభుత్వం ఎండియు వ్యవస్థను రద్దు చేసి పాత పద్ధతిలో రేషన్ షాపుల వద్దే రేషన్ పంపిణీకి ఆదేశాలు ఇవ్వడంతో మండలంలో 1వ తేదీ నుండి రేషన్ పంపిణీకి అధికారులు, డీలర్లు ఏర్పాట్లు చేశారు. యలమంచిలి మండలంలో 40 రేషన్ డీలర్ల పరిధిలో 21,299 కార్డుదారులు ఉండగా, 3,017 క్వింటాళ్ల బియ్యం, 20,582 పాకెట్ల పంచదార విడుదల చేసినట్లు సివిల్ సప్లై డిటి సోమశేఖర్ గురువారం తెలిపారు. ఒక్కో రేషన్ షాపుకు సగటున 600 నుండి 800 వరకూ రేషన్ కార్డుదారులున్నారు. ఇంటింటికి రేషన్ తీసుకెళ్లే వాహనాలను రద్దు చేయడంతో రేషన్ షాపుల ముందు క్యూలు పెరుగుతాయని కొందరు అంటున్నారు. అయితే 15 రోజుల్లో ఎప్పుడు అవకాశం ఉంటే అప్పుడు రేషన్ తీసుకోవచ్చనే అభిప్రాయమూ కూడా వ్యక్తమవుతోంది.

కమీషన్ పెంచాలని డీలర్ల డిమాండ్

ఇదిలా ఉండగా రేషన్ డీలర్లు కమీషన్ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. టన్నుకు ఇస్తున్న రూ.1,000 స్థానే తెలంగాణాలో ఇస్తున్నట్లుగా టన్నుకు రూ.1400 ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం కొత్త రేషన్ షాపులు ఏర్పాటుకు నిర్ణయించడంతో డీలర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ డీలర్లు పెరిగితే, షాపు పరిధిలో కార్డు దారుల సంఖ్య తగ్గి కమీషన్ తగ్గుతుందని డీలర్లు అభిప్రాయపడుతున్నారు.

రేషన్ డిపోల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రతి రేషన్ షాపు వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తహశీల్దారు ఎం.లక్ష్మి డీలర్లను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్లో రేషన్ డీలర్లతో ఆమె సమావేశమయ్యారు. 1వ తేదీన రేషన్ డిపోల వద్ద సరుకులు ఇవ్వడం ప్రారంభం సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కోరారు. వికలాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేయాలని డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో సిఎస్డిటి ఈశ్వరరావు, డిటి మురళీధర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్లతో మాట్లాడుతున్న తహశీల్దారు లక్ష్మి

పంట పద్ధతులు, యాంత్రీకరణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహన్‌రావు రైతులకు వివిధ పంటల వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ యాంత్రికరణ గురించి వివరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి. ప్రభాకర్ రావు ఖరీఫ్ కాలానికి గాను వివిధ ఉద్యాన పంటలు, కూరగాయలు సాగు గురించి తెలియజేశారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ గౌరీ చెరుకు గురించి, బెల్లం విలువ ఆధార ఉత్పత్తుల గురించి మాట్లాడారు. డిఆర్సి అధికారులు సిహెచ్.సుబ్రహ్మణ్యం, పి.శ్రీధర్ రైతులతో వివిధ వ్యవసాయ సమస్యల గురించి మాట్లాడి సలహాలు అందించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న రైతులకు కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ సంబంధిత పథకాలు గురించి వివరించారు. పచ్చి రొట్ట ఎరువులు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బిసిటి కెవికె భూసార శాస్త్రవేత్త మట్టి ప్రాముఖ్యత గురించి పచ్చి రొట్ట ఎరువుల గురించి రైతులకు తెలియజేశారు. పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ రాజ్ పాడి పశువుల గురించి పశుగ్రాస సాగు గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి కసింకోట, వెదురుపర్తి, తేగాడ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దావత్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం- చోడవరం రోడ్డులోని గాలి భీమవరం దరి ఉన్న దావత్ ఫ్యామిలీ రెస్టారెంట్, దాబాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తాసిల్దార్ బి చిన్నకృష్ణ, ఫుడ్ ఇన్స్పెక్టర్ కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని ఫ్యామిలీ రెస్టారెంట్, దాబా, హోటళ్లలో ఆహార నాణ్యత, ప్రమాణాలు సరిగా ఉన్నాయో, లేదో తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. దాబాలో శీతల హిమ పేటిక (ఫ్రిజ్)లో తందూరి చికెన్, పన్నీర్ శాంపిల్స్ను స్టేట్ ఫుడ్ లాబరేటరీ హైదరాబాద్ వారికి పంపించినట్లు తెలిపారు. ఇకపై సాధారణ ఫుడ్ సేఫ్టీ తనిఖీలలో భాగంగా మండలంలోని ఫ్యామిలీ రెస్టారెంట్, హోటళ్లు, దాబాలలో ఆహార నాణ్యత ప్రమాణాలను వారానికొకసారి ఫుడ్ సేఫ్టీ టీం ఆకస్మిక తనిఖీలు చేపడతారని తెలిపారు. ఈ టీంలో తహసీల్దార్, ఫుడ్ ఇన్స్పెక్టర్, ఎస్ఐలు ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా దావత్ దాబాలో చికెన్ తందూరి, పన్నీర్ శాంపిల్స్ను స్టేట్ ఫుడ్ లేబరేటరీ హైదరాబాద్ వారికి పంపించి టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టెస్టుల్లో ఏదైనా నాణ్యత ప్రమాణంలో తేడా ఉంటే దాబాపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్వీట్ స్టాల్స్, జ్యూస్ సెంటర్లల్లో ఫుడ్ కలర్స్ 100 పిపిఎం మోతాదుకు మించి వినియోగించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, ఎస్ఐ దివ్య, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆపరేషన్ కగార్‌పై సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - యలమంచిలి : ఆపరేషన్ కగార్ అంశంపై సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన అనకాపల్లి రోటరీ హాల్లో జరుగు సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. ఆయన గురువారం యలమంచిలిలో సిపిఐ నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేపట్టారు. దొరబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్ దండకారణ్యంలో నెత్తుటి ఏరులై పారిస్తోందన్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో అటవీ సంపదను కార్పొరేట్ పరం చేయడమే లక్ష్యంగా కనిపిస్తోందని తెలిపారు. దండకారణ్యంలో 28 రకాల ఖనిజాలు లభ్యమౌతున్నాయని, ఆ సంపద దోచుకోవడమే లక్ష్యంగా కార్పొరేట్ శక్తులు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, జిల్లా సమితి సభ్యులు వియ్యపు రాజు, బి.బాబ్జి, నియోజకవర్గ నాయకులు సంతోష్, గోవిందమ్మ పాల్గొన్నారు.

ఎంపిఇఒలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : వ్యవసాయ శాఖలో గత 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీఈఓలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాజాంలో వీరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి ప్రశాంత్, కె శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.12వేల గౌరవ వేతనంతో తాము పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం వ్యవసాయశాఖలో అమలు చేసే అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమతో పాటు వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులకు రూ.33వేలు పేస్కేల్ అమలు చేస్తున్న ప్రభుత్వం తమను మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర జీతంతో కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బంది పడుతున్నామన్నారు. 2014లో చంద్రబాబు ప్రభుత్వంలోనే తమను రోస్టర్ పద్ధతిలో నియమించారని, నాటి నుండి అదే జీతంతో పని చేస్తున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న తమకు గత రెండు సంవత్సరాలుగా ఇన్సెంటివ్లు కూడా ఇవ్వలేదన్నారు. తమకు వేతనాలు పెంచి, ఇన్సెంటివ్లు విడుదల చేయాలని సీఎం చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిఇఒలు

జెసిబితో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

శ్మశానంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయితీ పెదనాయుడుపాలెం గ్రామంలో సర్వే నెంబర్ 190లో గల శ్మశానం ఆక్రమణలను అధికారులు గురువారం తొలగించారు. ఈ శ్మశానంలో సుమారు 27 సెంట్లు భూమిలో కొంత మేరకు అక్రమణలకు గురికావడంతో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. అయన వెంటనే స్పందించి మండల రెవెన్యూ అధికారితో మాట్లాడి గ్రామస్తుల సహకారంతో సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. అనంతరం జెసిబితో అక్రమణలకు తొలగించినట్లు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గండి దుర్గా ప్రసాద్ తెలిపారు. త్వరలోనే శ్మశానం నిర్మాణానికి నిధులు మంజూరుకి ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముర్రి లక్ష్మణ్ రావు, గండి కనకరాజు, బండారు శ్రీను, రెడ్డి నాయుడు, సింగంపల్లి వంశీ, సిరపరపు రామకృష్ణ, గండి దేముడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మంచినీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని అచ్చెర్ల ఎస్సి కాలనీ మర్రి చెట్టు దగ్గర మంచి నీటి చేతి బోరు పాడైపోవడంతో ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది నాగేశ్వరరావు గురువారం మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, నైనముశెట్టి రమణరావు, గుడిబండ జాన్, భూషణం పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించకుంటే ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

ప్రజాశక్తి -సీలేరు

ఉపాధి హామీ పథకం కూలీ పనులు చేసిన కూలీలకు వేతన బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించుకుంటే ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మురళి చంటిబాబు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకే వీధి మండలం ఏ దారకొండ పంచాయతీ పరిధి గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి, నల్లమోక, ఎ.దారకొండ, చిలక వీధి, దుర్గం, జాజుపాకలు గ్రామాలోత పాటు 16 పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు కూలీలకు వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. రెండు నెలల నుంచి పనులు నిర్వహిస్తున్న కూలీలకు కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కుటుంబ జీవనం గడవక అనేక ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి తక్షణమే ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిలకల సోమరాజు, మురళి శ్రీనుబాబు, పేతురు గంగరాజు, పెద్దబ్బాయి, సత్యమూర్తి, లక్ష్మయ్య, కూలీలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహశీల్దారు కార్యాలయం

- పైకప్పు పెంకుల్లో పెరుగుతున్న మొక్కలు
- రెవెన్యూ రికార్డులు భద్రపరిచే గదికి చెదలు
- మండల మేజిస్ట్రేట్ ఆఫీసులో మరుగుదొడ్డి కరువు
- బ్రిటిష్‌కాలం నాటి భవనంలో మౌలిక సదుపాయలు మృగ్యం

శిథిల స్థితిలో కనీస సౌకర్యాలు లేకుండా ఉన్న తహశీల్దారు కార్యాలయం

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దాదాపు 80 ఏళ్ల క్రితం బ్రిటిష్ వారి హయాంలో నిర్మించిన భవనంపై కప్పు పెచ్చులూడి పడుతోంది. పనిచేసే ఉద్యోగులు బితుకు బితుకుమని విధులు నిర్వహిస్తున్నారు. పాత గోడలు, స్తంభాలకు, పైకప్పులో పగుళ్ల ఏర్పడి వర్షపు నీరు కార్యాలయంలోకి కారుతోంది. విలువైన రికార్డులు భద్రపరచడం గగన మైపోతోంది. చిన్న చిన్న మరమ్మతులు చేస్తున్నా సమస్య పునరావృతమౌతుంది. శాశ్వత పరిష్కారం వైపు ప్రభుత్వం అడుగులేయాలని అటు ప్రజలు, అధికార్లు కోరుతున్నారు.

పూర్వం తాలుకాగా పేరొంది, కార్యక్రమాలు చేపట్టిన కార్యాలయం నేడు దీనావస్థకు చేరడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ముందుండే కూటమి ప్రభుత్వ హయాంలోనైనా తహశీల్దార్ కార్యాలయపు వెతలు తీరుతాయని ఆశిస్తున్నారు. పైకప్పు పెంకుల ఖాళీల్లో పిచ్చి మొక్కలు మొలిచి పగుళ్లకు మరింత ఊతమిస్తున్నాయి. వర్షాకాలంలో వర్షం నీరు కారుతుండడంతో భవనం మరింత బలహీన పడుతోంది. కార్యాలయంలో విఆర్ఒలు, విఆర్ఎలు, ఆర్ఐలతో కలిసి సుమారు 47 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నిత్యం వివిధ రకాల పనులతో పదుల సంఖ్యలో ప్రజలు సందర్శిస్తుంటారు. వారు కూర్చోవడానికి సదుపాయం లేదు. కనీస అవసరమైన మరుగుదొడ్డి సదుపాయం లేకపోవడం మరింత ఇబ్బంది కరంగా మారింది. మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు ముందుకొచ్చి కాంపౌండ్‌లోని పిచ్చి తుప్పల్ని తొలగించారు. రూఫ్ టాప్‌పై గల పెంకులపై మొలిచిన మొక్కల్ని కూడా తొలగించి నీరు కారకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. కనీసం మంచినీటి బోరుబావి కూడా లేదు. ఈ శిథిల భవనాన్ని భద్రత దృష్ట్యా త్వరతగతిన మరమ్మత్తు పనులు చేపట్టాలని లేదా కొత్త భవనం నిర్మించాలని అటు ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

అప్పటి బ్రిటిష్ కాలంలో 1.42 ఎకరాల్లో తహశీల్దార్ కార్యాయం నిర్మించారు. వర్షం నీరు కారడం, విలువైన ఫైళ్లను చెదలు తినేయడం లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నాం. మరమ్మతుల కోసం ఇంజనీర్లతో అంచనాలు వేయించాం. రూ.18 లక్షలు అవుతుందన్నారు. ఆ విషయం జిల్లా అధికార్లకు తెలిపాం. ఇటీవల ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కార్యాలయాన్ని సందర్శించారు. మరమ్మతులకు తాను కూడా సహకరిస్తానని తెలిపారు.

- కె.వరహాలు, తహశీల్దారు

దళితుల ఇళ్ల వైపు మురుగు కాలువ మళ్లింపు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పనులు ఆపలేదు
- సూరెడ్డిపాలెం దళితుల ఆవేదన

ప్రజాశక్తి-కె.కోటపాడు

గ్రామంలో మొదటి నుండి ఉన్న డ్రైనేజీ కాలువను మూసివేసి అమాయక దళితులమైన తమ ఇళ్లకు ఆనుకొని కొత్తగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పట్నాల మురళి, కణితి గణేష్, కణితి లక్ష్మి, గండి కృష్ణవేణి, ఎల్లపు రాములమ్మ, ఈశ్వరరావు తదితరులు తెలిపారు. తమ గ్రామంలో కొందరు వైసీపీ కార్యకర్తల ఇళ్లవైపు ఉన్న మురుగు కాలువను మూసివేసి కొత్తగా తమ ఇళ్ళ వైపు నిర్మిస్తున్నారని వారు చెప్పారు. దాని వలన తమకు ఇబ్బందికరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పనులు ఆపడం లేదన్నారు. వైసీపీ నాయకుడు మాజీ జడ్పిటిసి సభ్యుడు ఈర్లే గంగు నాయుడు ప్రసాద్‌తో కుమ్మక్కై కాంట్రాక్టర్ సూరెడ్డి ఎరికినాయుడు దౌర్జన్యంగా కాలువ నిర్మిస్తున్నారని, దీనిపై కే కోటపాడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. తమ ఇళ్ళ వైపు నిర్మిస్తున్న కాలువ వలన వర్షాకాలంలో మా ఇళ్లలోకి మురుగునీరు చేరిపోతుందన్నారు. ఆ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఎప్పటినుండో రివాజు ప్రకారం ఉన్న కాలువను పునర్నిర్మించాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సునీత మాట్లాడుతూ పాతకాలువ నిర్మించేందుకు ఎక్కువ వ్యయం అవుతుందని, కొత్తగా నిర్మిస్తున్న కాలువ వలన ఎవరికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు.

దళితుల ఇళ్ల వైపు డ్రైనేజీ నిర్మిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం-1 33/11కెవి పరిధిలో టౌన్ వన్ టౌన్ టు ఫీడర్స్ పిఎమ్ఐ కారణంగా 11కేవీ సబ్బవరం టౌన్ 1, 2 ఫీడర్ ఎల్‌సి ఇవ్వడం జరగుతుందని, కావున ఈనెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్ పరిధిలోని సబ్బవరం, పెదనాయుడుపాలెం, గొల్లలపాలెం, ఆదిరెడ్డిపాలెం చిన్నయ్యపాలెం, గొర్లివానిపాలెం గ్రామాలు పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

3న మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 3వ తేదీన మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపిడిఒ కొండలరావు తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

కెకె లైన్‌లో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజన్ పరిధిలోని కోరాపుట్ - కొత్తవలస విభాగం (కెకె లైన్)లో తైడా - చిమిడిపల్లి ప్రాంతాల మధ్య భారీ వర్షాలకు 53/54 మైలురాయి వద్ద కొండ చరియలు విరిగిపడటంతో ఆ మార్గం గుండా ఇనుప ఖనిజం లోడ్‌తో వెళ్తున గూడ్స్ రైలు పట్టాలు తప్పిన క్రమంలో తలపెట్టిన పునరుద్ధరణ పనులు గురువారమూ కొనసాగాయి. ఆ పనులను డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ఎడిఆర్ఎం ఇన్‌ఫ్రా ఇ.శాంతారామ్ పర్యవేక్షించారు. పునరుద్ధరణ పనుల నేపథ్యంలో 58501 విశాఖపట్నం - కిరండోల్ ప్యాసింజర్, 58502 కిరండోల్ - విశాఖపట్నం ప్యాసింజర్, 18516 కిరండోల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్‌లను మే 30వ తేదీన రద్దయ్యాయి.

రామునాయుడుకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి భర్త, వైసిపి సీనియర్ నాయకులు బోకం రామునాయుడును మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి అన్నంరెడ్డి అదీప్ రాజ్ గురువారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా రామునాయుడు షుగర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని తెలుసుకొని అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పార్టీ సీనియర్ నాయకులతో గుల్లేపల్లిలోని రామునాయుడు ఇంటికి వెళ్ళి పరామర్శించారు. రామునాయుడు అనారోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గండి రవి కుమార్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, మాజీ జడ్పీటీసీ కోటాన రాము తదితరులు పాల్గొన్నారు.

రామునాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

మున్సిపల్ సమావేశంలో ఉద్రిక్తత

-వైసిపి, టిడిపి కౌన్సిలర్ల మధ్య ఘర్షణ - ఇరు గ్రూపుల మధ్య అదుపుతప్పిన మాటలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో కౌన్సిలర్ల ఘర్షణ చోటుచేసుకుంది. గురువారం చైర్పర్సన్ బోదపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, టిడిపి కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధ్య వాదులాట కొట్లాటకు దారి తీసింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను నివారించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్లు తమ వారికి మద్దతుగా సమావేశంలో లేచి నిలబడ్డారు. దీంతో సమావేశం లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఎజెండా లో ఉన్న సుజల స్రవంతి మంచినీటి సరఫరాకి సంబంధించి చర్చ జరుగుతున్న సమయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, టిడిపి కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు లమధ్య మాట మాటా పెరిగింది. మైక్ లతో దాడులకు దిగారు. పోలీసులు ఘర్షణలను నివారించారు.కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో రూ.21 కోట్లతో అభివృద్ధి చేపట్టామని తెలిపారు. గత నాలుగేళ్లలో నర్సీపట్నంలో అభివృద్ధి లేకుండా పోయిందని విమర్శించారు. వైసీపీ కౌన్సిలర్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ స్పందిస్తూ 26 వార్డుల్లో డ్రైనేజ్ సరిగా లేదని పేర్కొన్నారు. దీనిపై పద్మావతి సమాధానంగా గత 25 సంవత్సరాలుగా తాను కౌన్సిలర్ గా లేనని, కూటమి ప్రభుత్వంలో కాలువ పనులు ప్రారంభించబడ్డాయని తెలిపారు. 24వ వార్డ్ టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో అభివృద్ధి పనులపై రికార్డులు చూపాలని ప్రశ్నించారు. 28వ వార్డ్ కౌన్సిలర్ డబ్బీర్ శ్రీకాంత్ మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీకి పూర్తిస్థాయిలో నిధులు మంజూరవుతున్నప్పటికీ ఓర్వలేని వైసీపీ సభ్యులు అసత్య ప్రచారాలతో సభలో గందరగోళం సృష్టించడాన్ని తప్పుబట్టారు. వైసీపీ సభ్యులు ఆధారాలు లేకుండా అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని ధనిమిరెడ్డి మధు సవాల్ విసిరారు.

ఘర్షణ పడుతున్న కౌన్సిలర్లు

వినతిపత్రాన్ని ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ర్యాలీకి అనుమతి కోరుతూ వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: 2024 ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కారణంగా జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినంగా ప్రకటించడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం డిఎస్పి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రాన్ని అందించారు. ర్యాలీకి అనుమతిని కోరుతూ విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, సిబిఎం కాంపౌండ్ నుంచి పెదబొడ్డేపల్లి జంక్షన్ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో డిఎస్పీకి వినతి పత్రం అందజేశామని తెలిపారు.

ఆలయాలకు విరాళాలు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న ముత్యాలమ్మ ఆలయానికి గురువారం గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, సతీమణి ప్రభావతి దంపతులు తమ తల్లిదం డ్రులు గొల్లవిల్లి రామారావు, వరహాలమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ. 50 వేలు నగదు ఆలయ కమిటీ చైర్మన్ కోలా రాముకు విరాళంగా అందజేశారు. మాడుగుల స్థానిక గాంధీ పార్క్ వద్ద ఆంజనేయ స్వామి ఆలయ గోపుర నిర్మాణానికి అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు శ్రీనాథ్ శ్రీనివాసరావు 30 వేల నగదును ఆలయ అభివృద్ధికి శ్రీనుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, కార్యదర్శి బుచ్చిబాబు, హరిప్రసాద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న దాతలు

సిహెచ్‌డబ్ల్యూలకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలో పనిచేస్తున్న 725 కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు గత నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. సుందర్రావు మాట్లాడుతూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు నెలకు 4000 వేతనం ఐటిడిఏ చెల్లిస్తుందని, ఇచ్చే కొద్దిపాటి వేతనాలు నెల తరబడి బకాయిలు పెట్టడంతో ఆర్థిక ఇబ్బందితో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. గత కొంతకాలంగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని ఉద్యమిస్తున్నారని తెలిపారు.

శివదత్‌ను కలిసిన రేషన్ డీలర్లు

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయం లో గురువారం సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోదపాటి శివదత్‌ను రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివదత్ మాట్లాడుతూ, జూన్ ఒకటవ తేదీ నుండి రేషన్ డిపోల వద్ద లబ్ధిదారులకు పక్కాగా రేషన్ సరుకులు అందజేయాలని సూచించారు. రేషన్ డిపోల వద్ద నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మనోహర్ ఫోటోలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపమాక పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు పాము గణేష్, నాయకులు కురందాసు అప్పలరాజు, బత్తిని గోవిందు, నాని, శీను పాల్గొన్నారు.

.రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న శివదత్

యోగాతో ప్రశాంతత

నక్కపల్లిలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ఉపమాక లో యోగాంధ్ర 2025 పై గురువారం ఎంపీడీవో సీతారామరాజు ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వెంకన్న ఆలయం ప్రాంతంలో ఉద్యోగులంతా యోగా చేశారు. యోగ పోటీల్లో విజేతలకు ఉపమాక సచివాలయ ఉద్యోగులు సమకూర్చిన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, ఆయుష్ డాక్టర్ కె.రఘు ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీవో భాగ్యవతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ లలిత, ఈవోఆర్డీ శ్రీనివాస్, యోగా గురువు దవరసింగి రాంబాబు, యోగా మాస్టర్ ట్రైనీలు ఎన్ వి ఎస్ ఆచార్యులు, ఆదిత్య రుత్విక్ పాల్గొన్నారు.

నాతవరం:స్థానిక కళ్యాణ మండపంలో యోగా శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో తహసిల్దార్ ఏ.వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

కోటవురట్ల:ప్రతినిత్యం యోగాసనాల్లో పాల్గొంటే పలు లాభాలు పొందవచ్చునని తహసీల్దార్ తిరుమల బాబు అన్నారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్ డి రఘురాం పాల్గొన్నారు.

అనకాపల్లి:యోగా వల్ల ఆరోగ్యంతో పాటు ప్రశాంతత కలుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా గురువారం అనకాపల్లి పట్టణం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి నూకాంబికా ఆలయ ముఖద్వారం వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. యోగ గురువు దొరనాయుడు యోగాలోని ఆసనాలు బ్రీతింగ్ టెక్నిక్స్ అన్నీ కూడా చేసి చూపించి అందరితో చేయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్మాన్ అధికారిని డాక్టర్ కె లావణ్య, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామారావు, జిల్లా రిసోర్స్ కేంద్రం అధికారులు శ్రీధర్ సుబ్రహ్మణ్యం మురళి, సహాయ వ్యవసాయ సంచాలకులు రవీంద్ర పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. రెండో రోజు శుక్రవారం బుచ్చియ్యపేటలో ప్రభుత్వ అధికారులకు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ నిర్వహించారు. ఆయుష్ వైద్యాధికారి రామలక్ష్మి యోగా గురువు పైడిరాజు, మాస్టర్ ట్రైనర్ హేమ సాయి ఆధ్వర్యంలో యోగాలో శిక్షణ ఇస్తున్నారు.

భీమునిపట్నం : యోగాంధ్రలో జీవీఎంసి ఒకటో జోన్, భీమిలి మండలం నుంచి ఎంపిక చేసిన 200 మంది విద్యార్థులకు స్థానిక కృష్ణాకాలనీ యోగా శిక్షణా కేంద్రంలో మూడురోజుల శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో జెడ్‌సి బమ్మి అయ్యప్ప నాయుడు, ఎంపిడిఓ ఎన్ హనుమంతరావు, యునాని వైద్యాధికారి డాక్టర్ ప్రతిభ, ఎంఇఒ జయప్రద, స్థానిక యోగా శిక్షణా కేంద్రం కార్యదర్శి జి అప్పలనాయుడు, సిఆర్‌పి శివ దయాళ్ పాల్గొన్నారు యోగాతో ఆరోగ్యం సమకూరుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ అన్నారు.

పద్మనాభం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగాంధ్రలో భాగంగా 144 మంది పలు శాఖల అధికారులు, సిబ్బందికి ఎంపిడిఒ ఎం విజయకుమార్ ఆధ్వర్యంలో యోగాశిక్షణనిచ్చారు. కార్యాలయ సూపరింటెండెంట్ విజయ, ఇఒపిఆర్‌డి మీనాకుమారి పాల్గొన్నారు.

ములగాద : జివిఎంసి ఐదో జోన్ కమిషనర్ రాము ఆధ్వర్యంలో 60వ వార్డు ఆసుపత్రి వద్ద పారిశ్రామిక ప్రాంతం ప్రజలకు, సచివాలయం సిబ్బందికి యోగ శిక్షణ తరగతులను నిర్వహించారు, కార్యక్రమంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఊరుకోటి సతీష్ కుమార్, నవరత్నం, రమేష్, రవి, సునీల్ సచివాలయం సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆనందపురం: స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగాంధ్ర ప్రోటోకాల్ యోగా శిక్షణలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఆసక్తి కలిగిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా గురువు సోమా స్ఫూర్తి, మాస్టర్ ట్రైనర్ నాగరాజు నేతృత్వంలో మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, ఎంపిడిఒ డాక్టర్ వి. జానకి పాల్గొన్నారు.

హోదా ఆర్డర్‌ను చూపిస్తున్న విజయ్ ప్రకాష్

శ్రీ ప్రకాష్‌కు స్వయం ప్రతిపత్తి హోదా

ప్రజాశక్తి -నక్కపల్లి :పాయకరావుపేటలో శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ అయిన స్పైసెస్ డిగ్రీ కళాశాల కు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుండి స్వయంప్రతిపత్తి హోదా పొందినట్లు కళాశాల సంయుక్త కార్యదర్శి శ్రీ సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ హోదా 2025-2026 విద్యా సంవత్సరం నుంచి 2034-2035 విద్యా సంవత్సరం వరకు దశాబ్దకాలానికి వర్తిస్తుందని వెల్లడించారు. ఈ హోదాతో కళాశాలకు సొంతంగా కోర్సులు రూపొందించుకునే, సిలబస్‌ను అభివృద్ధి, పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంటుందన్నారు. స్వయం ఉపాధి స్వావలంబన అనే ధ్యేయంతో పనిచేస్తున్న ఈ విద్యాసంస్థకు ప్రతిష్టాత్మక గుర్తింపు లభించడం వల్ల గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు మరింతగా అందుబాటులోకి వస్తాయని విజయ్ ప్రకాష్ తెలియజేశారు. స్వయంప్రతిపత్తి ద్వారా విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపర్చే దిశగా కట్టుబడి ఉన్నట్లు శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కె. నరేంద్ర బాబు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సిహెచ్ వి.కె. నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, సిబ్బంది సహా ఈ ఘనత సాధనలో భాగమయ్యిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న విఆర్‌ఒలు

రేషనలైజేషన్‌పై పునరాలోచించాలి

ప్రజాశక్తి కోటవురట్ల :రెవెన్యూ అధికారుల సంఖ్యను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 4పై పునరాలోచించాలని గురువారం పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు తహసిల్దార్ తిరుమల బాబుకు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా విఆర్వో సంఘ నాయకులు పి.రమేష్ మాట్లాడుతూ, గ్రామ జనాభా ప్రాతిపదికను ఆధారంగా చేసుకుని రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా చేసి ఒక గ్రామానికి విఆర్ఓ ను మరో గ్రామానికి విలేజ్ రెవెన్యూ సర్వేయర్ కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ విధానంతో మండల వ్యాప్తంగా ప్రస్తుతం 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా జీవో నెంబర్ 4 అమలయితే సగం మంది వీఆర్వోలను మిగులు సిబ్బంది గా చూపించడంతో వీఆర్వోలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని తెలిపారు. మిగులు సిబ్బందిని ఏ శాఖకు సర్దుబాటు చేస్తారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి విఆర్ఓ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు అప్పారావు, అనూష, నూకరత్నం పాల్గొన్నారు.

స్పీకర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఆర్‌ఎంపిలు

స్పీకర్‌ను కలిసిన ఆర్‌ఎంపిలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఎఫ్ఎఫ్ఎంపీఏ ఏపీ ఫెడరేషన్ ఆదేశాల మేరకు బీహెచ్ఎంపిఏపి ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్ఎంపి డాక్టర్లు స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో పలు సమస్యలను పరిష్కరించాలని గురువారం అయ్యన్నను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 465 జిఓకు చట్ట భద్రత కల్పించి సామాజిక వైద్య సహాయకులుగా (హెల్త్ ప్రొవైడర్లు) గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఫెడరేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి మామిడి రాజామణి, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొప్పన లక్ష్మణరావు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ళ వెంకట సత్యనారాయణ, నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు నిద్ర అచ్చియ్య నాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొప్పన రామారావు (రాము). ఉమ్మడి విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు పైల అప్పలనాయుడు, పైల నాయుడు, లక్ష్మీ శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాస్, నర్సిహామూర్తి, భవానీ శంకర్ పాల్గొన్నారు.

సూర్యఘర్ యోజనపై అవగాహన

ప్రజాశక్తి- మాధవధార : ఎపిఇపిడిసిఎల్ రెండో జోన్ పరిధిలో గల ఎన్ఎస్‌టిఎల్ సెక్షన్‌లో విశాఖపట్నం ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో గురువారం మాధవధారలో ఇంటింటికీ వెళ్లి ప్రధా మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఇంటి పైకప్పుపైనే సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని, ఇంటికి సరిపడా విద్యుత్‌ను వాడుకోవచ్చని, దీనికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని వివరించారు. అవసరానికి మించి ఎక్కువైన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి, ఆదాయం కూడా పొందవచ్చన్నారు. సాంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పర్యావరణ హితమైన విద్యుత్‌ను ప్రోత్సహించడం కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సోలార్ ప్యానెల్స్ పెట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందన్నారు. స్థానిక ఎఇఇ వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:విశాఖ ఉక్కు కర్మాగారంలో గత పది రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరవధిక సమ్మె చేస్తూ,యాజమాన్యం బెదిరింపులకు లొంగకుండా సమ్మె కొనసాగిస్తున్న విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన పోరాటానికి మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వి జగన్నాథరావు, సమన్వయ కమిటీ సభ్యులు వి.ఎస్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ ఉక్కు యాజమాన్యం కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న ప్రభుత్వ విధానాలకు లోబడి తొలగించిన 3 వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. తొలగింపుకు సిద్ధం చేసిన మరో 1800 మంది కార్మికులను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె చేస్తుంటే,ఉత్పత్తి కుంటుపడుతుంటే, వారి సమస్యలు పరిష్కరించాల్సిన విశాఖ ఉక్కు యాజమాన్యం పోలీసులతో కార్మికులను భయ భ్రాంతులను చేయటాన్ని తాము ఖండిస్తున్నామన్నారు.కేంద్ర ప్రభుత్వం ఎలాగైనా విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని, అందులో భాగంగానే రూ. 11440 కోట్ల ప్యాకేజీ పేరుతో ఇచ్చి, జిఎస్టి వంటి ఇతర అప్పులు లేకుండా చేసి, ప్రైవేటు వ్యక్తులకు ఈ కర్మాగారాన్ని అప్పజెప్పాలని కుట్ర చేస్తున్నట్టుగా తాము భావిస్తున్నట్లు తెలిపారు. ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను ఖండిస్తున్నామన్నారు. 40 సంవత్సరాల విశాఖ ఉక్కు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల పహారాతో బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తమ న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న కార్మికులను సస్పెన్షన్లతోనూ, షోకాజ్ నోటీసులతోనూ నిలువరించడం పారిశ్రామిక వివాదాల చట్టం 1948 ఉల్లంఘన అవుతుందన్నారు.ఇటువంటి అప్రజాస్వానికి చర్యలు వెంటనే నిలుపుదల చేసి ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, కర్మాగారంలో శాంతియుత వాతావరణాన్ని నెల కొల్పాలని డిమాండ్ చేశారు.

కూటమి పాలనలో కుంటుపడ్డ పథకాలు

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

నగదు ఇస్తున్న వాసుపల్లి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంలో విద్య వైద్యం పథకాలు కుంటుపడ్డాయని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. గురువారం ఆసీలుమెట్ట కార్యాలయంలో 34 వ వార్డు వైసిపి బూత్ ప్రెసిడెంట్ అంబటి అప్పలరాజు కుమార్తె స్రవంతి ఇంటర్లో చేరేందుకు రూ.12 వేలు తన సొంత నిధులను మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా విద్య,వైద్యాన్ని ు అందించారన్నారు.ఈ రెండు కల్పిస్తే ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవుతారని,తద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధించవచ్చునన్నారు. ముఖ్యమంత్రిగా అందలం ఎక్కిన చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతను, విద్యార్థుల్ని మోసం చేస్తే వారి తిరుగుబాటును కూటమి తట్టుకోలేదని హెచ్చరించారు. సూపర్ సిక్స్ లో ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేకపోతున్నానని చెపుతున్న చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధిపై జగన్మోహన్ రెడ్డి ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. రెడ్ బుక్కు రాజ్యాంగం నడుపుతున్న నారా లోకేష్ ప్రశ్నిస్తున్న వైసిపిపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు.ప్రజలు ఒక సంవత్సరం పాలనలోనే విసుగిపోయారని,వచ్చే వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తారని గణేష్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో 34 వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైసిపి జిల్లా బిసి సెల్ ప్రెసిడెంట్ సనపల భరత్, ఎర్నిమాంబ టెంపుల్ చైర్మన్ రమణ పాల్గొన్నారు.

డీలర్లతో మాట్లాడుతున్న తహశీల్దార్

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: జూన్ 1 నుంచి రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్దేశించిన సమయాల్లో తప్పనిసరిగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సూచించారు, డీలర్లు తమ పరిధిలో గల కార్డుదారులకు ఉదయం ఎనిమిది గంటల నుంచి 12 గంటల వరకు, 12 గంటల నుంచి 4 గంటల వరకు అందజేయాలన్నారు. వృద్ధులకు వికలాంగులకు ఇంటికి తీసుకువెళ్లి అందజేయాలన్నారు, రేషన్ దుకాణాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దుకాణాలకు వచ్చే రహదారిలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు వినియోగదారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. రేషన్ పంపిణీ సమయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడరాదని, గోదాములో అందజేసే ప్రతి సరుకును డిపోలో అందుబాటులో ఉంచాలని సూచించారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ఉక్కు సమ్మెపై నిర్బంధం ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు తమ ఉపాధి రక్షణ కోసం 10 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారని, ఆ సమ్మెపై ప్రభుత్వ, పోలీసు నిర్బంధాన్ని ఆపివేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1500 రోజులపైబడి దీక్షలు, ఆందోళనలు జరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్యం కలసి ఏ పద్ధతీ పాటించకుండా సుమారు 3 వేల మంది కార్మికులను అక్రమంగా తొలగించినట్టు తెలిపారు. సమ్మె చేస్తున్న కార్మికులతో ఏ విధమైన చర్చలూ జరపకుండా నిర్ధాక్షణ్యంగా పోలీసులను పెట్టి తీవ్రమైన నిర్బంధం విధిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్మికులపైనా, నాయకులపైనా అక్రమంగా కేసులు పెట్టారన్నారు. కార్మికుల ఇళ్ల వద్దకు పోలీసులు వెళ్లి భయ భ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణమే తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలతో చర్చలు జరపాలన్నారు.

రొయ్యల కంపెనీ..

కార్మికురాలి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

సిఐటియు, సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్.రాయవరం మండలం గుడివాడలో గల సాయి మెరైన్ ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రొయ్యల) యూనిట్ -2 కంపెనీలో ఒరిస్సా రాష్ట్రం కార్మికురాలు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ సాయి మెరైన్ ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న నివాస గృహాల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఉంటూ కంపెనీలో పని చేస్తున్నారని తెలిపారు. గురువారం ఉదయం ఒడిస్సా రాష్ట్రం కోరా గ్రామానికి చెందిన హుల్కా అనిత(19)కు ఆరోగ్యం బాగోలేదని ఆమెని నక్కపల్లి ఏరియా ఆసుపత్రికి సిబ్బంది తీసుకువెళ్లారని, అప్పటికే మరణించిందని ఏరియా ఆసుపత్రి డాక్టర్లు ధ్రువీకరించారని పేర్కొన్నారు. హుల్కా అనిత మరణంపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. సాయి మెరైన్ ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రొయ్యల) కంపెనీలో అనుమానస్పదంగా మృతిపై సమగ్ర విచారణ చేయాలని, హుల్కా అనిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ.శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, బి.రాము, జి.రమణ వై నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం:మండలంలో గుడివాడ గ్రామానికి సమీపంలో సాయి మెరైన్ రొయ్యల కంపెనీలో అనుమానాస్పదంగా మరణించిన గిరిజన మహిళా కార్మికురాలు హులకా అనిత మృతి పై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్ ప్రాంతానికి చెందిన అనీత గత నెల రోజులుగా ఈ కంపెనీలో పనిచేస్తూ కంపెనీ క్వార్టర్ లోనే ఉంటుందన్నారు. బుధవారం రాత్రి కంపెనీలో మరణించిన అనీత మృత దేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి కంపెనీ యాజమాన్యం తీసుకురావడం జరిగిందన్నారు.వైద్యులు అనీత అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని తెలిపారు. కంపెనీ యాజమాన్యం పై పోలీసులు కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్.సోమేష్, ఎం.నరేష్, పి.సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ : 9490099125
మధురవాడ : 8008596645
గాజువాక : 9849392359
అనకాపల్లి : 8008736188
చోడవరం : 9490099141
నర్సీపట్నం : 9440280411
పాడేరు : 9490099142
రంపచోడవరం : 9440165617
పూర్ణమార్కెట్ : 9490099676
జగదాంబ : 9490099434
జివియంసి : 9490099483
ద్వారకానగర్ : 9490099672
కంచరపాలెం : 9490099135
మాదవధార : 9490099675